సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



అవస్థలు డబుల్

అండర్ పాసేజ్‌లతో అవస్థలు పెరుగుతున్నాయి. వాన నీరు నిలిచిపోతోంది.

- 8లో



రిజిస్టర్ పోస్టుకు బ్రేక్

రిజిస్టర్ పోస్టుకు ఆ శాఖ బ్రేక్ వేసింది. ఈ సేవ స్పీడ్ పోస్టులో విలీనమైంది.

- 8లో

6న మారథాన్ 5కే రన్

అరసవల్లి: ఎయిడ్స్‌పై యువతకు అవగాహన కోసం జిల్లా కేంద్రంలో వచ్చేనెల 6న మారథాన్ 5కే రన్‌ను నిర్వహిస్తున్నట్లుగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి అనిత, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ తాడేల శ్రీకాంత్ తెలియజేశారు. ఆసక్తి గల వారు వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 9494474206 కాల్ చేయాలన్నారు.

న్యూస్‌రీల్

రైతులకు ఎరువులు అందడం లేదు



వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: మండలంలో రైతులకు సకాలంలో రసాయన ఎరువులు అందడం లేదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు భవానీ శంకరరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తితో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. మండలంలోని రైతులకు ఎరువులు అందడం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చెబుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఎరువులు అందజేయాలని కోరారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ ఎరువులు వచ్చే వారంలో మండలానికి అవసరమైనంత చేరుకుంటాయని తెలియజేశారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు ఉన్నారు.

గంబూషియాతో దోమల లార్వాకు చెక్




ఇంద్రపుష్కరిణిలో గంబూషియా చేపలను విడిచిపెడుతున్న కలెక్టర్, డీఎంహెచ్‌ఓ

అరసవల్లి: జిల్లాలో దోమల వ్యాప్తి నియంత్రణలో భాగంగా నీటితో నిండిన చెరువుల్లో దోమల ఉత్పత్తి కేంద్రాలైన లార్వాలను తినేసే గంబూషియా చేపలను విడిచిపెట్టనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆయన శనివారం ఉదయం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ఇంద్ర పుష్కరిణిలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.అనితతో కలిసి గంబూషియా చేపలను విడిచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 5 లక్షల గంబూషియా చేపలను సిద్ధం చేశామని, జిల్లాలో మొత్తం 165 టీమ్‌లతో అన్ని చెరువుల్లోనూ వీటిని విడిచిపెట్టేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కెఎన్‌వీడీవీ ప్రసాద్, డీఎంహెచ్‌ఓ అనిత, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి పీవీ సత్యనారాయణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, అరసవల్లి యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బి.సాయిదివ్య తదితరులు ఉన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ముమ్మరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో గల 6,51,717 పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా క్యూ ఆర్ కోడ్ ఆధారిత రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఆగస్టు 25 నుంచి ప్రారంభమైందని, ఈ పంపిణీ సెప్టెంబర్ 15 వరకు కొనసాగుతుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత కార్డుదారులు తమ రేషన్ షాప్ పరిధిలోని సచివాలయ సిబ్బంది లేదా రేషన్ డీలర్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ చేయించుకోకుంటే ఇతర ప్రభుత్వ పథకాలు వర్తించవని ఆయన స్పష్టం చేశారు. అలాగే వాణిజ్య అవసరాలకు తప్పనిసరిగా వాణిజ్య గ్యాస్ సిలిండర్లను మాత్రమే వాడాలని సూచించారు.

సిక్కోలు టీడీపీలో నిశ్శబ్ద యుద్ధం!



- చాలాకాలానికి తెరపైకి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి
- ఏడాదిన్నరగా రాజకీయాల్లో సైలెంట్‌గా ఉన్న గుండ ఫ్యామిలీ
- జిల్లా కేంద్రంలో గొండు శంకర్ వన్ మ్యాన్ షో
- తెరవెనుక ప్రోత్సాహంతో యాక్టివ్‌ైన గుండ లక్ష్మీదేవి
- గొండు శంకర్ ఏకఛత్రాధిపత్యానికి చెక్ పడేలా పావులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లా టీడీపీ రాజకీయాల్లో సమీకరణాలు మారుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో చాలాకాలంగా స్తబ్దుగా ఉన్న గుండ లక్ష్మీదేవి మళ్లీ క్రియాశీలకం కావడం చర్చనీయాంశమైంది. అధిష్టానం ఆడిస్తున్న డ్రామానో... జిల్లాలోని టీడీపీ వర్గాలు నడుపుతున్న రాజకీయాలో తెలీదు గాని గుండ ఫ్యామిలీ మళ్లీ యాక్టివ్ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పుడున్న ఎమ్మెల్యే చెక్ పెడతారో? సమాంతరంగా నాయకత్వం అప్పగించి ప్రోత్సహిస్తారో గానీ నియోజకవర్గంలో ప్రస్తుతం హాట్ టాపిక్ అయింది.

ఏడాదిన్నరగా సైలెంట్..

సాధారణ ఎన్నికల్లో టిక్కెట్ రాకపోవడంతో అధిష్టానంపై అసంతృప్తి వ్యక్తం చేసి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి దంపతులు ఎన్నికలకు దూరంగా ఉండిపోయారు. టిక్కెట్ దక్కని సమయంలో అధినేతపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. ముఖ్యంగా తనకు పార్టీలో అంతర్గత శత్రువుగా ఉన్న గొండు శంకర్‌కు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోయారు. దీనికంతటికీ జిల్లాలో పార్టీపై పెత్తనం చెలాయిస్తున్న కింజరాపు కుటుంబమే కారణమని ఎన్నికల సమయంలో బాహాటంగానే గుండ అనుచరులు అసంతృప్తి వ్యక్తం చేశారు.వారికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. మొత్తానికి ఎన్నికలైపోయాయి. ఎవరినైతే వ్యతిరేకించారో ఆయనే ఎన్నికల్లో గెలిచారు. దీంతో గుండ దంపతులు రాజకీయంగా సైలెంట్ అయ్యారు.

మళ్లీ తెరపైకి..

తాజాగా మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మళ్లీ తెరపైకి వచ్చారు. జిల్లాలోకి మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు వచ్చిన తర్వాత ఆయనతో భేటీ కావడం, ఆ వెంటనే టీడీపీ నాయకులతో టచ్‌లోకి వెళ్లడం జరిగాయి. ఆ తర్వాత జిల్లాకు వస్తున్న టీడీపీ నాయకులందరినీ కలవడం మొదలు పెట్టారు. అంతేకాకుండా తనతో పాటు గతంలో పనిచేసి కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న నాయకులు కూడా గుండ లక్ష్మీదేవి చెంతకు చేరుతున్నారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌పై అసంతృప్తి వ్యక్తమవుతుందనో, రోజురోజుకీ పట్టు సడలుతుందనో, ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ఒకరినే నమ్ముకుంటే కష్టమనో.. కారణం తెలియదు గానీ అధిష్టానం కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. దానిలో భాగంగా పార్టీ అధికారిక కార్యక్రమాలకు కూడా గుండ లక్ష్మీదేవి హాజరవుతున్నారని సమాచారం. తాజాగా జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎంపిక అభిప్రాయ సేకరణ సమావేశంలో కూడా వేదికపై ఆమె ఆసీనులయ్యారు. దీంతో టీడీపీలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. ఇన్నాళ్లూ సైలెంట్‌గా ఉన్న గుండ లక్ష్మీదేవి ఒక్కసారి యాక్టివ్ కావడం వెనక పెద్ద వ్యూహమే ఉందని తెలుస్తోంది.

గొండు శంకర్‌కు పోటీగా పెడతారా?

ప్రస్తుతం శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గొండు శంకర్ ఉన్నారు. నియోజకవర్గ పార్టీ బాధ్యతలు ఆయనే చూసుకుంటున్నారు. పార్టీ సంస్థాగత నియామకాలు చేసుకుంటున్నారు. కింజరాపు కుటుంబీకుల అనుచరుడిగా కొనసాగుతూ రాజకీయాలు చేస్తున్నారు. మరి, అధిష్టానం ఏం ఆలోచిస్తుందో గానీ అకస్మాత్తుగా తెరపైకి వచ్చిన గుండ లక్ష్మీదేవికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎన్నికల దగ్గరి నుంచి సైలెంట్‌గా ఉన్న నేతను పార్టీ జిల్లా అధ్యక్ష పదవి అభిప్రాయ సేకరణ సమావేశంలో ముందు వరుసలో కూర్చోబెట్టి ప్రాధాన్యత కల్పించారు. మాజీ ఎమ్మెల్యే అని గౌరవించడం వరకు ఓకే కానీ, ఎన్నికలో పనిచేయని నేతకు ప్రాధాన్యత కల్పించడమే టీడీపీలో చర్చనీయాంశంగా మారింది. శ్రీకాకుళం టీడీపీలో ఏదో జరుగుతోందని, ఎమ్మెల్యే గొండు శంకర్‌కు సమాంతర నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నట్టుగా ఉందని నియోజకవర్గ టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఈ ఎపిసోడ్‌లో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పూర్వపు అనుచరులంతా ఆనందపడుతుండగా, ఆమె వస్తే మన పరిస్థితేంటని ఎమ్మెల్యే అనుచరులు ఆందోళన చెందుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ ఇవ్వకపోవడం, ఆమె ఎన్నికలకు దూరంగా ఉండటం వల్ల కొంతమంది మరింత యాక్టివ్ అయ్యారు. వేరే పార్టీలో ఉండి కొంతమంది ఎన్నికలకు ముందు వచ్చారు. ఇప్పుడు వారంతా అయోమయంలో పడి, ఏం జరుగుతుందోనని ఆత్రుత పడుతున్నారు.

ఎరువుల సరఫరా ఏకపక్షం

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- రైతన్నకు తప్పని ఎరువు కష్టాలు

ఆమదాలవలస రూరల్:

అన్నదాతకు అందాల్సిన ఎరువులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎరువుల సరఫరా ఏకపక్షంగా జరుగుతోందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి ఎరువులు చేరడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే పూర్తిగా ఎరువులు అందే పరిస్థితి ఏర్పడింది. దీనిపై జిల్లా అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. తొలిదశలో రైతు సేవా కేంద్రాల ద్వారా కొంత సరఫరా చేసినా ఆ తర్వాత మొత్తం ఎరువులు వ్యాపారులకు అందించటంతో ఎరువు కరువుగా మారింది.

గగ్గోలు పుట్టిస్తున్న ధరలు

ఎరువుల వ్యాపారులు అధికార పార్టీ నాయకులు అండదండలతో కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్న సంగతి చాలా చోట్ల బయటపడింది. ఒక యూరియా బస్తాపై రూ. 100 నుంచి రూ.150 వరకు అదనంగా తీసుకుంటున్నారు. కాంప్లెక్స్ ఎరువులపైనా ఇదే స్థాయిలో దోపిడీ జరుగుతోంది. ముఖ్యంగా ఆమదాలవలసలో రైల్వేగూడ్స్ షెడ్ ఉండటం, ఇందుకు దగ్గరలో గోదాంలు కూడా ఉన్నందున వ్యాపారుల వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఇంత అక్రమాలు జరుగుతున్నా ఇక్కడ అధికారులు కనీసం తనిఖీ చేసేందుకైనా ముందుకు రావడం లేదు. నిఘా విభాగం సైతం నిద్ర నటిస్తోంది.



ఆమదాలవలస రైల్వే ప్లాట్‌ఫారం వద్ద అక్రమంగా తరలించేందుకు సిద్ధంచేసిన ఎరువుల నిల్వలు

తప్పని నిరీక్షణ

బూర్జ: మండలంలో గల నీలాదేవిపురం (నీలంపేట) గ్రామ రైతు సేవా కేంద్రానికి ప్రభుత్వం నుంచి శనివారం 222 బస్తాల యూరియా వచ్చింది. నీలాదేవిపురంతో పాటు వావాం, ఉప్పపేట, బూర్జ నుంచి రైతులు రావడంతో తోపులాట జరిగింది. అధికారులు పోలీసు సహాయం కోరడంతో ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక సిబ్బందితో రైతులను క్యూలో నిలబెట్టారు.



నీలాదేవిపురంలో యూరియా కోసం రైతు సేవా కేంద్రం ఎదురుగా నిరీక్షిస్తున్న రైతులు

ప్రభుత్వం విఫలమైంది..



రైతులకు ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. అధికార పార్టీ నాయకులు తమ ఇళ్లలో ఎరువులు ఉంచుకుని వారికి కావాల్సిన వారికే ఇచ్చారు. అధికారులు కూడా వారికి వంత పాడారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయ కర్త

కొంప ముంచేశారు



రైతులకు ఎరువుల కొరత రావటం చాలా బాధాకరం. చాలా గ్రామాల్లో ఇప్పటికీ ఎరువులు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

– బొడ్డేపల్లి కృష్ణారావు, రైతు, ఇసకలపేట గ్రామం, ఆమదాలవలస మండలం

టెక్కలిపట్నం గ్రామ సచివాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు



యూరియా కోసం పాట్లు

పలాస: పలాస మండలం టెక్కలిపట్నం గ్రామ సచివాలయం వద్ద రైతులు శనివారం యూరియా కోసం ఎగబడ్డారు. ఒక రైతుకు ఒకే బస్తా ఇస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలాస ఎ.డి.ఎ రామారావును వివరణ కోరగా పలాస డివిజన్‌కు మొత్తం 19 టన్నుల యూరియా వచ్చిందని, సగానికి పైగా ఇప్పటికే అందజేశామన్నారు. ఒక ఎకరాకు అరబస్తా మాత్రమే ఇస్తున్నామని, రెండు దఫాలుగా ఒక బస్తా ఇస్తున్నామని ఇది ప్రభుత్వం నిబంధన అని చెప్పారు.

రుషికొండపై చేసిన విమర్శలు గుర్తున్నాయా..?

- చంద్రబాబు, పవన్ డ్రామాలు కట్టిపెట్టాలి
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా చూడాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట:



ధర్మాన కృష్ణదాస్

ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కూటమి నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, విశాఖ వచ్చిన కూటమి నాయకులు మరోసారి దీన్ని రుజువు చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విభాగాలుగా విభజించి ప్రైవేటీకరణ చేస్తున్నారని, దీనిపై కూటమి నాయకులు స్పందించలేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌పై ఎన్నికల ముందు అనేక హామీలిచ్చిన నాయకులు ఇప్పుడు పెదవి విప్పాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ఒకే విధానంపై ఉందని గుర్తు చేశారు. ఆనాడే అసెంబ్లీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేశామన్నారు. విశాఖ ప్రజలు కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రుషికొండ భవనాలపై విషం కక్కిన నాయకులు ఇప్పుడు వాటిని వాడుకోవడానికి పోటీ పడుతున్నారని తెలిపారు. అప్పట్లో జగన్ ప్యాలెస్ అంటూ దుష్ప్రచారం చేసి, ఇప్పుడు భవనాల వద్ద ఫొటోలు దిగుతున్నారని విమర్శించారు. జగన్ ప్యాలెస్ అన్న నాయకులు జీఓలో ఎందుకు అలా పెట్టలేదని ప్రశ్నించారు. కూటమి నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు.



ఇచ్ఛాపురం: ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో గిలాయివీధి కూడలిలో ఏర్పాటుచేసిన వినాయకుడు



శ్రీకాకుళంలో 10 అడుగుల అయోధ్య రాముని అవతారంలో వినాయకుడు

గౌరీ తనయాయ ధీమహి

మండపాలు ధగధగా మెరిసిపోతున్నాయి. వినాయకుడు కొలువైన వీధులన్నీ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటున్నాయి. వినాయక నవరాత్రి వేడుకలు జిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. వినూత్న విగ్రహాలు, మండపాలు దర్శించేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.



కొత్తూరులోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో వినాయక మండపం వద్ద సమర్పించిన 108 రకాల ప్రసాదాలు



హిరమండలం: పెద్దకోట గ్రామంలో లక్షదీపారాధన



గంగమ్మ ఒడికి...

గణనాయకుడు గంగమ్మ ఒడికి చేరుకుంటున్నాడు. వినాయక నిమజ్జనోత్సవాలు మొదలైపోయాయి. శనివారం పలు విగ్రహాలను జిల్లా కేంద్రంలోని నాగావళిలో నిమజ్జనం చేశారు. ఊరంతా ఊరేగించి చెమ్మగిల్లిన కళ్లతో ఇష్టదైవానికి భక్తులు వీడ్కోలు చెబుతున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

బార్లకు ముగిసిన డ్రా

- ఐదు బార్లకు లైసెన్సులు కేటాయింపు
- దరఖాస్తులు ఎక్కువగా పడక వెలవెలబోయిన అంబేడ్కర్ ఆడిటోరియం

శ్రీకాకుళం క్రైమ్ : ఎక్సైజ్ శాఖ బార్ పాలసీలో భాగంగా జిల్లాలో ఐదు బార్లకు లాటరీ పద్ధతిన లైసెన్సుదారులను అధికారులు నిర్ణయించారు. శనివారం ఉదయం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో టోకెన్ డ్రా పద్ధతిన లాటరీ ప్రక్రియ ప్రారంభమైంది. సంబంధిత విభాగం నుంచి జిల్లా డిప్యూటీ కమిషనర్ దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం కార్పొరేషన్, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో జనరల్ కేటగిరీలో 17 బార్లకు గాను, రిజర్వ్ కేటగిరీలో (గీతకులాలవారికి) 2 బార్లకు గాను దరఖాస్తులు కోరగా 22 దరఖాస్తులే వచ్చాయన్నారు. ఆమదాలవలస, ఇచ్ఛాపురంలో ఒక్క దరఖాస్తు కూడా పడకపోగా, శ్రీకాకుళంలో 3 జనరల్ కేటగిరీ, ఒక రిజర్వ్ కేటగిరీ (శ్రీశయన)కి, పలాస-కాశీబుగ్గలో ఒక రిజర్వ్ (సొండి) కేటగిరీకి దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ విధంగా చూసుకుంటే శ్రీకాకుళంలో 16 దరఖాస్తులు రాగా, పలాసలో ఆరు వచ్చాయని, ఒకే వ్యక్తి నాలుగు దరఖాస్తులు వేసిన సందర్భాలు రెండు చోట్ల ఎదురయ్యాయన్నారు.



డ్రా తీస్తున్న డీఆర్వో వెంకటేశ్వరరావు, పక్కనే డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

వెలవెలబోయిన ఆడిటోరియం..

బార్ల లైసెన్సు డ్రాలో దరఖాస్తుదారులకంటే ఎక్సైజ్ సిబ్బందే ఎక్కువ ఉండటం గమనార్హం. కూటమి పార్టీలకు చెందిన మద్యం సిండికేట్ ముందస్తుగా వేసుకున్న ప్రణాళికతోనే టెండర్లు వేయలేదని పలువురు చర్చించుకుంటున్నారు. అందుకే ఆమదాలవలస, ఇచ్ఛాపురం, కాశీబుగ్గల్లో జనరల్‌లో ఒక్క అప్లికేషన్ కూడా రాలేదన్నారు. పడని వాటికి తర్వాత మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామని అధికారులు చెబు తున్నా టీడీపీ నాయకులు టెండర్లు వేయకుండానే తక్కువ డిపాజిట్లతో దక్కించుకోవాలన్న కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ బ్యాంకులకు, చిట్‌ఫండ్ కంపెనీలకు, ఇన్సూరెన్స్ కంపెనీలకు మంచి అవకాశమని, వారి కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని న్యాయసదన్‌లో న్యాయవాదులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ద్విచక్ర వాహనచోదకుడు మృతి

టెక్కలి రూరల్: నౌపడ ఆర్ఎస్ రైల్వేగేట్ సమీపంలో రహదారిపై శనివారం రాత్రి ద్విచక్ర వాహనచోదకుడు మృతిచెందాడు. అతని వద్ద లభించిన ఫోన్ ఆధారంగా నందిగాం మండలం కణితూరుకి చెందిన కంచరాన చంటిగా గుర్తించారు. ఈయన మూలపేట పోర్టులో పొక్లెయినర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడా లేక మరేదైనా కారణం ఉందా? అనే విషయమై స్పష్టత రాలేదు. టెక్కలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



సాయం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

పలాస: పలాస మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఎ.ఆర్.కానిస్టేబుల్ తలగాపు శంకరరావు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. శంకరరావు భార్య శిరీషకు సంఘం తరపున లక్ష రూపాయలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణానాయుడు, కోశాధికారి కె.భుజంగరావు, కార్యవర్గ సభ్యులు నరిసింగరావు, ఆర్ఐ శంకరప్రసాద్, ఆర్ఎస్ఐలు హరనాథ్ రవి తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్



బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ బస్సులపై రవాణాశాఖ కొరఢా ఝుళిపించింది. శనివారం జాతీయ రహదారి ప్రాంతాల్లోని పలు కూడళ్లల్లో ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాల్లో తనిఖీలు నిర్వహించింది. సకాలంలో రెన్యువల్స్, టాక్సులు కట్టని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల నుంచి రూ.52,600 వసూలు చేస్తూ 29 కేసులు నమోదు చేసినట్లు శ్రీకాకుళం డీటీసీ ఎ.విజయసారథి తెలిపారు.

జాబ్‌మేళాలో 42 మంది ఎంపిక



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 42 మంది ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూ యువ కేంద్రం వేదికగా సుస్వదీప్ కంపెనీలో ఉద్యోగాల కోసం నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 93 మంది యువత హాజరయ్యారు. వీరిలో 42 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ మాట్లాడుతూ చదువుతోపాటు సాంకేతికత, నైపుణ్యాలను పెంచుకుంటూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్, నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారులు, పాల్గొన్నారు.

108 అంబులెన్సులో ప్రసవం



బిడ్డకు జన్మనిచ్చిన బుజ్జమ్మ

పాతపట్నం: లాబర గ్రామానికి చెందిన దొర బుజ్జమ్మ 108 అంబులెన్సులో ప్రసవించింది. శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందజేశారు. సిబ్బంది సకాలంలో లాబర చేరుకుని వాహనంలో గర్భిణిని పాతపట్నం సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ రావడంతో వాహనం పక్కకు ఆపారు. వైద్యురాలు జి.అనిత ఆశ వర్కర్ రవణమ్మ సహాయంతో మెడికల్ టెక్నీషియన్ కె.ఆఫీస్, పైలట్ ఎస్.గోపాలకృష్ణలు గర్భిణికి ప్రసవం చేయించడంతో ఆడ బిడ్డ జన్మించింది. అనంతరం పాతపట్నం సీహెచ్‌సీలో చేర్పించారు.

అండర్ పాసేజ్‌లు.. అవస్థలు డబుల్!



చిక్కాలవలస వద్ద రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ పాసేజ్ వద్ద నీరు

- కష్టాలు రెట్టింపయ్యాయంటున్న వాహనచోదకులు
- రైల్వే అండర్ పాసేజ్‌లలో నిలిచిపోతున్న వర్షపు నీరు
- రోజుల తరబడిన స్తంభించిపోతున్న వాహనాల రాకపోకలు
- పట్టించుకోని రైల్వే అధికారులు



దాసరివానిపేట రైల్వేక్రాసింగ్ వద్ద నీటిలో ద్విచక్ర వాహనదారుడి ఇబ్బందులు



చిక్కాలవలస వద్ద రైల్వే ట్రాక్ పై నుంచి ద్విచక్ర వాహనం తరలిస్తున్న దృశ్యం

నరసన్నపేట : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారింది రైల్వే అండర్ పాసేజ్‌ల పరిస్థితి. రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనచోదకుల నిరీక్షణకు తెరదించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ అండర్ పాసేజ్‌లు ఇప్పుడు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా వర్షాలు పడేటప్పుడు నీటితో నిండిపోయి రాకపోకలకు వీలు లేకుండా చేస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రతిష్టాత్మకంగా అండర్ పాసేజ్‌లు నిర్మించింది. కొన్ని గంటల వ్యవధిలోనే అండర్ పాసేజ్‌లు నిర్మించామంటూ గొప్పగా చెప్పుకున్నారు. వీటిని నిర్మించేందుకు వారి ఆలోచన ఒకలా ఉంటే క్షేత్రస్థాయిలో ఇక్కడ ప్రజలు, వాహనదారులు పడుతున్న అవస్థలు మరోలా ఉన్నాయి. అండర్ పాసేజ్‌లు నిర్మాణం పూర్తయితే కష్టాలు తొలగుతాయి అని వాహనదారులు ఆశించారు. అందుకు భిన్నంగా అవస్థలు మరింత పెరిగాయి. ‘అప్పుడే బాగుండేది.. గేటు వేస్తే కొద్ది నిమిషాలు వేచి ఉండేవారం.. గేటు తీసి ఉంటే యథావిధిగా వెళ్లిపోయే వాళ్లం. ఇప్పుడలా కాదు. వర్షా కాలం వచ్చిందంటే రోజుల తరబడి అండర్ పాసేజ్‌లో నీరు నిలిచిపోయి రాకపోకలకు అవాంతరాలు ఎదురవుతున్నాయి..’ అంటూ పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్న వర్షం పడినా అండర్ పాసేజ్‌ల వద్ద నీరు నాలుగైదు అడుగుల మేర నిలిచిపోతోంది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. 15 రోజుల క్రితం పడ్డ వర్షానికి నాలుగు రోజులు రాకపోకలు నిలిచిపోగా వారం క్రితం పడ్డ వర్షానికి మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. అండర్‌పాసేజ్‌ల్లో చేరిన నీరు తొలగించేందుకు, నీరు చేరకుండా ఉండేందుకు రైల్వే శాఖ చేపట్టిన చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఇవేం అండర్ పాసేజ్‌లు..



అండర్ పాసేజ్‌లు ఎవరి కోసం నిర్మించారో అర్థం కావడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వీటి వల్ల కష్టాలు రెట్టింపయ్యాయి. వర్షం పడిన ప్రతిసారి రోజుల తరబడి చిక్కాలవలస వద్ద రాకపోకలు నిలిచిపోతున్నాయి. తప్పని పరిస్థితుల్లో వాహనాలను రైల్వే ట్రాక్ పైనుంచే తీసుకెళ్లాల్సి వస్తోంది. రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు.

– ఎం. లక్ష్మునాయుడు, చిక్కాలవలస

అధికారులు స్పందించాలి..



వర్షం పడిన ప్రతిసారీ ఇబ్బందులు పడుతున్నాం. వాహనాలు నడపలేకపోతున్నాం. ఇరువైపులా రాకపోకలు నిలిచిపోతున్నాయి. అయినా రైల్వే శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజలను ఇలా కష్టాలకు వదిలేయడం అన్యాయం. మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడి నీరు నిల్వ లేకుండా చూడాలి.

– కింతలి విశ్వనాథం, దాసరివానిపేట

నాలుగు అడుగుల మేర నీరు..

నరసన్నపేట మండలంలో ఆర్అండ్‌బీ రహదారిపై నడగాం, చిక్కాలవలస, కంబకాయల వద్ద, పంచాయతీరాజ్ రహదారిపై దాసరివానిపేట వద్ద అండర్ పాసేజ్‌లు నిర్మించారు. నడగాం, దాసరివానిపేట, చిక్కాలవలసల వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. వర్షం నీరు నాలుగైదు అడుగుల మేర నిలిచిపోతోంది. దీంతో రోజుల తరబడి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దాసరివానిపేట రైల్వే క్రాసింగ్ వద్ద నిర్మించిన అండర్ పాసేజ్ అసంపూర్తిగా ఉంది. పైన రేకులు(రూఫ్) వేయలేదు. దీనిని నిర్మించే ముందు గ్రామస్తులకు రైల్వే శాఖ పలు హామీలు ఇచ్చింది. దాసరివానిపేట నుంచి ఉర్లాం రైల్వే స్టేషన్ వరకూ రోడ్డు వేస్తామని, పోలాకి చానల్‌కు డ్రైన్ నిర్మించి అండర్ పాసేజ్‌లో నీరు లేకుండా చేస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.

చంద్రబాబు మోసకారి



కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ

సరుబుజ్జిలి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నిక హామీలు తుంగలోకి తొక్కి ప్రజలను మోసగించారని వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా పార్లమెంటరీ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ(కేవీజీ) ధ్వజమెత్తారు. సరుబుజ్జిలి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించిన అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతన్నలు బస్తా ఎరువు కోసం గంటలకొద్దీ క్యూలైన్లలో నిలబడి సొమ్మసిల్లిపడిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. జిల్లాకేంద్రాల నుంచి లారీల ద్వారా వచ్చిన ఎరువులను కూటమి నేతలు అడ్డదారుల్లో తరలించి కార్యకర్తలకు అందిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి లేదన్నారు. స్థానిక వ్యవసాయాధికారి ఎరువుల వ్యాపారులు, కూటమి నేతలకు కొమ్ముకాస్తూ రైతన్నలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పనితీరు మార్చుకోవాలన్నారు.

సర్వీస్ చార్జి పది పైసలే!

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ టెండర్లలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రాజకీయ జోక్యంతో పాటు ‘స్థానిక’ంగా పోటీ కూడా పెరిగిపోవడంతో సర్వీస్ చార్జి అత్యంత కనిష్టంగా కేవలం పదిపైసలకు దిగిపోయింది. శనివారం నిర్వహించిన రెండు టెండర్లలోనూ దాదాపుగా అందరు పాటదారులు ఇదే సర్వీస్ చార్జిని కోట్ చేస్తూ టెండర్ దాఖలు చేశారు. ఇదో అరుదైన సంఘటనగా అధికారులు భావించి, అర్హత సాధించిన అన్ని టెండర్ కాపీలను ఉన్నతాధికారులకు పంపించేలా నిర్ణయాన్ని ప్రకటించారు. ఆలయానికి భద్రత నిమిత్తం సెక్యూరిటీ గార్డులు, పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది సప్లయికి వేర్వేరుగా టెండర్లను పిలిచారు. ఈ మేరకు శనివారం ఆలయ మండపంలో నిర్వహించిన టెండర్ ప్రక్రియలో మొత్తం రెండు టెండర్లకు 12 మంది హాజరు కాగా.. అందరూ సర్వీస్ చార్జిని కనిష్టంగా కేవలం 10 పైసలు (రూ.0.01)గానే నిర్ణయించుకుని కోట్ చేశారు. దీంతో అన్ని ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన అనంతరం అర్హత సాధించిన టెండర్ కాపీలను దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నట్లుగా ఆలయ ఈఓ కేఎస్‌వీడీవీ ప్రసాద్ ప్రకటించారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తదుపరి ఖరారు నిర్ణయం ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఈఓలుగా రావివలస, కోటబొమ్మాళి ఆలయాల ఈవోలు జి.గురునాథరావు, వి.రాధాకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులో నియామకాలు పూర్తి



అభ్యర్థులకు జాయినింగ్ ఆర్డర్లు ఇస్తున్న దృశ్యం


శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో ఖాళీల భర్తీ ప్రక్రియ శనివారంతో పూర్తయినట్లు డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన ఉద్యోగులకు శనివారం నియామక పత్రాలను అందజేశారు. డీసీసీబీలో 19 అసిస్టెంట్ మేనేజర్లు, 35 స్టాఫ్ అసిస్టెంట్‌ల నియామకం కోసం ఈ ఏడాది జనవరి 8న నోటిఫికేషన్ విడుదలైందని పేర్కొన్నారు. మే 5, 11వ తేదీలలో పరీక్షలు నిర్వహించగా 18 మంది అసిస్టెంట్ మేనేజర్‌లుగానూ, 31 మంది స్టాఫ్ అసిస్టెంట్లుగా అర్హత సాధించారని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం జిల్లాలో పలు డీసీసీబీ బ్యాంక్‌లలో ఖాళీగా ఉన్న చోట్ల జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చామన్నారు. బ్యాంక్ వ్యాపారం ప్రస్తుతం రూ.2610 కోట్లుగా ఉందని, వచ్చే మార్చి నెలాఖరు నాటికి రూ.3500 కోట్లకు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంక్ సీఈవో డి.సత్యనారాయణ, జీఎం ఎస్‌వీఎస్ జగదీష్, డీజీఎం ఎస్. రమేష్, మేనేజర్ దశరథ పాల్గొన్నారు.

ఎస్సీ మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: షెడ్యూల్డ్ కులాల మహిళలకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన 20 ఏళ్లు పైబడిన ఐదుగురు ఎస్సీ మహిళలకు 40 రోజుల పాటు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఏడాది దాటిన లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే అర్హులని, వివరాలకు 9704895271 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రిజిస్టర్ పోస్ట్‌కు బ్రేక్

- స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ ఉత్తర్వులు
- 171 ఏళ్ల బంధానికి స్వస్తిపలుకుతూ పోస్టల్ శాఖ నిర్ణయం
- సెప్టెంబరు 1 నుంచి అమలు



పాతపట్నం పోస్టాఫీసు

హిరమండలం: అత్యంత పురాతన ప్రభుత్వరంగ సంస్థ పోస్టల్. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో ప్రారంభమైన ఈ తపాలా వ్యవస్థ ఇప్పటికీ పటిష్టంగా కొనసాగుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త పుంతలు తొక్కుతోంది. సంస్కరణల్లో భాగంగా ‘రిజిస్టర్ పోస్టు’ సర్వీసుకు స్వస్తి పలికింది. సుమారు 171 ఏళ్లు సేవలందిస్తున్న రిజిస్టర్ పోస్టు సర్వీసును ఈ నెల 30తో నిలిపివేశారు. దీనిని స్పీడ్ పోస్టులో విలీనం చేశారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1 నుంచి స్పీడ్ పోస్టు విధానం మాత్రమే అందుబాటులోకి రానుంది. ఈ మేరకు జిల్లాలో 3 ప్రధాన, 64 ఉప, 507 బ్రాంచ్ పోస్టాఫీసులకు ఆదేశాలు వచ్చాయి.

ప్రధాన సమాచార వ్యవస్థగా..

మూడు దశాబ్దాల కిందట వరకూ బంధుమిత్రులకు కబురు పంపాలన్నా.. ముఖ్యమైన పత్రాలు చేరవేయాలన్నా పోస్టుకార్డు లేదా రిజిస్టర్ పోస్టు మాత్రమే ప్రధాన ఆశ్రయంగా ఉండేది. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ లేని కాలంలో ప్రజలతో పోస్టల్‌కు విడదీయరాని బంధం ఉండేది. ప్రభుత్వ శాఖలపరంగా అన్నిరకాల ఉత్తర ప్రత్యుత్తరాలు రిజిస్టర్ పోస్టు ద్వారా నడిచేవి. ఎందుకంటే దీనికి డెలివరీ ప్రూఫ్ ఉంటుంది. ఏదైనా కోర్టు నోటీసులు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి వచ్చే నోటీసులు అందుకున్న తరువాత అవతలి వ్యక్తికి అందినట్టు రశీదు పొందడం రిజిస్టర్ పోస్టు ప్రత్యేకత. ఇది చట్టపరంగా చాలా ఉపయోగపడుతుంది. ప్రధానంగా లీగల్ నోటీసులు, ఉద్యోగ నియామకాల అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ సంబంధిత పత్రాలు వంటి వాటిని పంపడానికి ఇవి ఎంతో ఉపయోగంగా ఉండేవి.

సంస్కరణలో భాగంగానే..

పోస్టల్ శాఖలో అనేక మార్పులు సంతరించుకుంటున్నాయి. దేశీయ పోస్టల్ సేవలను క్రమబద్ధీకరించడం, పనితీరు మెరుగుపరచడం, ట్రాకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవడంలో భాగమే ఈ విలీనమంటున్నాయి పోస్టల్ వర్గాలు. స్పీడ్ పోస్టు వేగవంతమైన డెలివరీకి ఎంతో ప్రాధాన్యం ఇస్తుంది. ఇప్పుడు రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్టులో విలీనం చేయడం వల్ల డెలివరీలు మరింత వేగవంతం అవుతాయి. ముఖ్యంగా స్పీడ్ పోస్టు ద్వారా పంపించిన పార్సిల్, పత్రాలు ఎక్కడ? ఏ స్టేజ్‌లో ఉన్నాయి? అన్న స్టేటస్ చాలా సులువుగా తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు వివరాలు పొందవచ్చు. ఈ సౌకర్యం రిజిస్టర్ పోస్టులో లేదు. తాజాగా ఒకే సేవ ఉండడం వల్ల పోస్టల్ శాఖకు పని చాలా సులువు అవుతుంది. అయితే రిజిస్టర్ పోస్ట్‌తో పోల్చుకుంటే స్పీడ్ పోస్టుకు చార్జీలు ఎక్కువే. రిజిస్టర్ పోస్టు కనీస చార్జీ రూ.26 ఉంటే స్పీడ్ పోస్టు చార్జీ రూ.41 వరకూ చెల్లించాల్సి ఉంటుంది.

వేగవంతమైన సేవలకే..



రిజిస్టర్ పోస్టు స్పీడ్ పోస్టులో విలీనం కావడం వాస్తవమే. సెప్టెంబరు 1 నుంచి ఈ విలీనం అమల్లోకి రానుంది. అందుకు ఏర్పాట్లు చేసుకోవాలని పోస్టల్ శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రజలకు వేగవంతమైన సేవలందించేందుకే పోస్టల్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

–జి.వెంకటేష్, పోస్టుమాస్టర్, పాతపట్నం పోస్టాఫీసు

అనుపోత్సవాలకు పటిష్ట భద్రత



డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో 2072 వినాయకుని మండపాల్లో ఆన్‌లైన్ సింగిల్ విండో పద్ధతి అనుమతులతో ప్రజలు ఉత్సవాలు నిర్వహిస్తున్నారని డీఎస్పీ సీహెచ్ వివేకానంద శనివారం తెలిపారు. వినాయక విగ్రహ ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం నగరంలో పెద్ద విగ్రహాలున్న సుమారు 25 మండపాల్లో సీసీ కెమెరాల నిఘా ఉందన్నారు. ఈ నెల 31న డివిజన్ పరిధిలో 400 విగ్రహాలు అనుపోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, వచ్చే నెల 2న 275, 4న 425, తొమ్మిదో రోజైన 6న 500 విగ్రహాలు, 8న 50 వరకు అనుపునకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. మద్యం సేవించి ఊరేగింపులో న్యూసెన్సు సృష్టించేవారిపై ప్రత్యేక దృష్టిపెట్టామని, గతేడాది వినాయక ఉత్సవాల్లో అల్లర్లు చేసేవారిపై ఇప్పటికే బైండోవర్లు కట్టామని, వారితో పటు ఇటీవల గొడవల్లో ఉన్నవారిపై షీట్లు తెరిచామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో మండపాలకు అనుమతించలేదన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీలో రిటైరైన, చనిపోయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు డిమాండ్ చేశారు. శనివారం శ్రీకాకుళంలోని రెవెన్యూ భవన్‌లో ఈయూ జిల్లా అధ్యక్షుడు జి.త్రినాథ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులకు వైద్యసౌకర్యాలు, ఆర్టీసీ ఆసుపత్రుల్లో మందులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు, ఎన్నికల హామీ మేరకు ఐఆర్ ప్రకటించి 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి మాట్లాడుతూ స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం విజయవంతం కావాలంటే కనీసం 3000 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, 10 వేల పోస్టులను భర్తీ చేయాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.నానాజీ, ఏపీజేఏసీ అమరావతి శ్రీకాకుళం జిల్లా కంచరాన శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి సీపాన వెంకటరమణ, జోనల్ అధ్యక్షులు కె.జే.శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, కోశాధికారి జి.తాతాలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.దశరథుడు (టెక్కలి డిపో), జిల్లా కార్యదర్శిగా గూనాపు త్రినాథ్ (శ్రీకాకుళం–1 డిపో), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.టి.వి.శ్రీనివాస్ (పలాస), చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా బత్తిన అప్పారావు (శ్రీకాకుళం– 2 డిపో), కోశాధికారిగా పి.వి.ఆర్.లలితకుమారి (శ్రీకాకుళం –1 డిపో), జాయింట్ సెక్రటరీగా బి.మురళిమోహన్, ప్రచార కార్యదర్శిగా వై.కె.కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎస్.జోగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డి.వనజాక్షి, ఎం.సురేష్, అసిస్టెంట్ సెక్రటరీలుగా వి.డి.రావు, సి.ఎస్.కుమార్ తదితరులు నియమితులయ్యారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈయూ నాయకులు కె.బాబూరావు, ఎస్వి రమణ, కె.గోవిందరా తదితరులు పాల్గొన్నారు.

ప్రతికూలతలు అధిగమిస్తేనే ‘వికసిత్ భారత్’



మాట్లాడుతున్న థామ్సన్ రివర్ యూనివర్శిటీ అధ్యాపకుడు డాక్టర్ బాలనిక్కు

ఎచ్చెర్ల : సమాజంలో ఎదురయ్యే సవాళ్లు, ప్రతికూలతలు, సంక్షోభాలు ఎదుర్కొన్నప్పుడే వికసిత్ భారత్ వంటి లక్ష్యాలను చేరుకోగలమని థామ్సన్ రివర్ యూనివర్శిటీకి చెందిన స్కూల్ ఆఫ్ సోషల్‌వర్క్, హ్యూమన్ సైన్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ బాల నిక్కు (కెనడా) అభిప్రాయపడ్డారు. బీఆర్ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో ‘ఆచరణలో స్థితిస్థాపకత.. వికసిత్ బారత్–2047 కోసం సంబంధిత సంఘాల నిర్మాణం, విద్యార్థుల భాగస్వామ్యం’ అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. యువతరం నిర్దేశిత లక్ష్యాలను కలిగి ఉండి ఆశావాహ దృక్పథంతో ముందుకుసాగి దేశ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. వైస్ చాన్సలర్ ఆచార్య కె.ఆర్ రజని మాట్లాడుతూ మేధో సంపత్తి, ప్రగతిదాయక ఆలోచనపరులు విదేశాలకు వెళ్లకుండా భారత్‌లోనే సేవచేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యా విభాగం సమన్వయకర్త, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ జేఎల్ సంధ్యారాణి పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎస్‌వో కె.సామ్రాజ్యలక్ష్మీ, అధ్యాపకులు హెచ్.సుబ్రహ్మణ్యం, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.వి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ ట్రాక్టర్ బోల్తా



పొలంలో పడిన బియ్యం బస్తాలు

సంతబొమ్మాళి: కోటబొమ్మాళి సివిల్ సప్లయ్ గొడౌన్ నుంచి మేఘవరం గ్రామానికి రేషన్ బియ్యం బస్తాలు తీసుకొస్తున్న ట్రాక్టర్ శనివారం కొల్లిపాడు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. 88 బియ్యం బస్తాలు పక్కన ఉన్న వరి పొలంలో పడిపోయాయి. విషయం తెలుసుకున్న వీఆర్ఓలు వేరే ట్రాక్టర్ సహాయంతో మేఘవరం, పాతమేఘవరం రేషన్ డిపోలకు బియ్యం తరలించారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు .

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు..



శ్రీనివాసరావు(ఫైల్)

టెక్కలి రూరల్: స్థానిక అక్కపు వీధికి చెందిన మోనింగి శ్రీనివాసరావు(42) శనివారం తన ఇంటి సమీపంలోని రాతి బావిలో శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీనివాసరావుకు భార్య స్వాతి, ఇద్దరు పిల్లలు. మసాల పౌడర్‌ల వ్యాపారం చేస్తుండేవాడు. మూడు రోజుల క్రితం పెళ్లిరోజు రావడంతో బయటకు వెళ్దామని భార్య చెప్పింది. అందుకు ఒప్పుకోకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్థాపానికి గురైన శ్రీనివాసరావు గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుంటుబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం శ్రీనివాసరావు ఇంటి సమీపంలో ఉన్న బావి వద్ద వ్యక్తి మృతదేహం తేలడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాము బావిలో మృతదేహాన్ని బయటకు తీయించగా మృతుడు శ్రీనివాసరావుగా గుర్తించారు. శ్రీనివాసరావు తండ్రి మోనింగి ప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి విద్యార్థిని మృతి

మెళియాపుట్టి : దీనబంధుపురం పంచాయతీ గేదెలపోలూరు గ్రామానికి చెందిన 4వ తరగతి విద్యార్థిని చెరువులో పడి మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం ఒంటి పూట బడి నిర్వహించడంతో సవర రెజీనా(9) గ్రామంలోని చెరువులోకి స్నానానికి దిగింది. ఆ సమయంలో ఏం జరిగిందో గానీ మునిగిపోయి చనిపోయింది. పోలీసులు గ్రామానికి చేరుకున్నప్పటికే మృతదేహం పూడ్చేశారు. ఫిర్యాదులు ఏమీ వద్దని వారించి గిరిజనులు పట్టుబట్టి పోలీసులను వెనక్కి పంపినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు.

దుబాయ్‌లో కాగువాడ వాసి మృతి



హుస్సేన్ సాహెబ్ (ఫైల్)

పాతపట్నం : దుబాయ్(యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)లో ఓ కంపెనీలో వెల్డర్‌గా ఉద్యోగం చేస్తున్న పాతపట్నం మండలం కాగువాడ వస్త్రపురి కాలనీకి చెందిన మొగల్ హుస్సేన్‌సాహెబ్ (44) శనివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు భార్య సుల్తాన్ బేగం మొగలీకు, కుటుంబ సభ్యులు కంపెనీ నిర్వాహకులు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వదేశం తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. సాహెబ్‌కు భార్య, కుమారుడు ఆల్తాఫ్ మొగల్ ఉన్నారు.